క్లుప్తంగా

నేటి నుంచి సప్తాహం

తానూరు: మండలంలోని మొగ్లి గ్రామంలో గురువారం నుంచి వారం రోజుల పాటు అఖండ హరినామ సప్తాహం ప్రారంభం కానున్నట్లు సప్తాహం కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం జ్ఞానేశ్వరి పారాయణం, మధ్యాహ్నం గాత భజన, రాత్రి కీర్తన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. కార్యక్రమానికి మండలంలోని ఆయా గ్రామాల వార్‌కరి భక్తులు హాజరు కావాలని కోరారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని రైతువేదికలో శుక్రవారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ కొండ్ర రేఖ అధ్యక్షతన మండల సర్వ సర్వ సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో పుష్పలత ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి అధికారులు తమ ప్రగతి నివేదికలతో హాజరు కావాలని కోరారు.

నేడు పసుపు యాజమాన్య పద్ధతులపై శిక్షణ

లోకేశ్వరం: మండలకేంద్రంలోని రైతువేదికలో గురువారం ఉదయం 9 గంటలకు వచ్చే ఖరీఫ్ సీజన్ కోసం పసుపు యాజమాన్యం, విత్తనాల ఎంపికపై ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు లోకేశ్వరం మహిళా రైతు ఉత్పత్తిదారుల కంపెనీ అధ్యక్షురాలు పోతుగంటి నాగమణి ఒక ప్రకటనలో తెలిపారు. నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి పసుపు పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ మహేందర్, సీనియర్ శాస్త్రవేత్తలు పాల్గొంటారని పేర్కొన్నారు. మండలంలో పసుపు సాగు చేసే రైతులు సకాలంలో హాజరవాలని కోరారు.

ఉపాధి పనులు ప్రారంభం



పనులు చేస్తున్న కూలీలు

తానూరు: మండలంలోని ఉమ్రి(కే) గ్రామంలో బుధవారం ఉపాధిహామీ పనులను టీఏ పోశెట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబ్‌కార్డులు కలిగిన కూలీలు పనులకు రావాలని సూచించారు. అర్హులైనవారు దరఖాస్తు చేసుకుంటే జాబ్ కార్డు అందించి పనులు కల్పిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఏ దిగంబర్ తదితరులు ఉన్నారు.

ఇంటి యజమానులకు రెడ్ నోటీసులు

నిర్మల్‌టౌన్: మున్సిపల్ పరిధిలో ఆస్తి పన్ను బకాయిలు చెల్లించకుండా జాప్యం చేస్తున్న 500 మంది ఇంటి యజమానులకు మున్సిపల్ అధికారులు రెడ్ నోటీసులు జారీ చేశారు. నోటీసులు అందుకున్న యజమానులు మూడు రోజుల్లోగా బకాయిలను చెల్లించాలని మున్సిపల్ రెవెన్యూ అధికారి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పన్ను చెల్లించని యజమానుల ఆస్తులను జప్తు చేస్తామని హెచ్చరించారు.

జెడ్పీటీసీ పూజలు



జెడ్పీటీసీని సత్కరిస్తున్న గ్రామస్తులు

నిర్మల్: సారంగపూర్ మండలంలోని తాండ్ర (జి) గ్రామంలో భక్తమార్కండేయస్వామి ఆలయంలో జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం ఆయనను గ్రామస్తులు సత్కరించి స్వామి వారి చిత్రపటం అందజేశారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దశరథ రాజేశ్వర్, కార్యకర్తలు, నాయకులు తదితరులు ఉన్నారు.

స్టడీమెటీరియల్ అందజేత



స్టడీమెటీరియల్ అందుకుంటున్న యువత

సాక్షి ఎఫెక్ట్..

ఖానాపూర్: పట్టణంలోని గ్రంథాలయంలో చదివే 50 మంది నిరుద్యోగ యువతీ యువకులకు మాజీ మంత్రి ఐకేరెడ్డి పీఏ కృష్ణంరాజు రూ.40 వేల విలువైన గ్రూప్స్, డీఎస్సీ స్టడీ మెటీరియల్‌ను బుధవారం అందజేశారు. గతంలో 'సాక్షి'లో అసౌకర్యాల నడుమ చదివేదెలా? అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి కృష్ణంరాజు స్పందించారు. గ్రంథాలయంలో సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం కృష్ణంరాజును శాలువాతో సన్మానించారు.

గొర్రెల పెంపకంలో మెలకువలు

- వేసవిలో జాగ్రత్తలు తీసుకోవాలి
- సమీకృత ఆహారం అందిస్తే మంద వృద్ధి
- లోకేశ్వరం మండల పశువైద్యాధికారి జెస్సీ



రాయపూర్‌కాండ్లీలో గొర్రెలమంద

లోకేశ్వరం: గొర్రెల పెంపకంలో మేలైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి లాభాలు ఆర్జించవచ్చు. గొర్రెల మాంసంతోపాటు వాటి ఎరువుకు కూడా మార్కెట్‌లో డిమాండ్ ఉంది. జీవాలు ఆరోగ్యంగా బలిష్టంగా ఉండాలంటే మంచి ఆహారం అందించాల్సి ఉంటుంది. గొర్రెలు రోగాల బారిన పడకుండా పశువైద్యాధికారుల జాగ్రత్తలు తీసుకుంటే మంద కూడా వేగంగా పెరుగుతోంది. పచ్చిక బయళ్లు దొరికితే గడ్డిని మేపుకోవచ్చు. గొర్రెల పెంపకంలో పాటించాల్సిన మెలకువలను లోకేశ్వరం మండల పశువైద్యాధికారి వివరించారు.

సమీకృత దాణా అవసరం ...

ప్రస్తుతం ఎండల కారణంగా పచ్చిక బయళ్లలో గొర్రెలకు సరిపడా పచ్చిమేత దొరకదు. దీంతో ఆహారం లభ్యం కాక గొర్రెలు చనిపోయే ప్రమాదం ఉంటుంది. అలాంటప్పుడు అవి మేసే మేతతోపాటు అదనంగా సమీకృత దాణా ఇస్తే వర్షాకాలం వరకు పౌష్టికంగా ఉంటాయి.

గొర్రెలకు కావాల్సిన దాణా మార్కెట్‌లో విరివిగా లభిస్తుంది. వేసవిలో ఎండ కారణంగా వేడిని తప్పించుకోవడానికి ఉదయం కానీ, సాయంత్రం కానీ మేపడానికి వదులుకోవాలి. అప్పుడప్పుడు గొర్రెల మంద బరువు పెరుగుతున్నాయా లేదా అని పరిశీలించాలి. ప్రతి నెలా గొర్రెల బరువును అంచనా వేస్తుండాలి. గత నెల కంటే ప్రస్తుత నెలలో బరువు తగ్గిపోయాయని గ్రహిస్తే అందించే ఆహారం తగ్గిందని భావించాలి. బరువు తగ్గిన గొర్రె పిల్లలను గుర్తించి వాటికి అదనపు ఆహారం (దాణా) అందించాలి.

మేతకు కావాల్సిన గడ్డి రకాలు..

గొర్రెల పెంపకానికి ఆరు బయట లభించే పొలాలు, పచ్చిక బయళ్లు కాకుండా అదనంగా కాస్త నీటి వసతి కలిగిన చోట ఏక వార్షిక, బహు వార్షిక గడ్డి జాతులను సాగు చేసుకోవాలి. ఇవే కాకుండా పచ్చిమేతకు అందించే చిక్కుడు, బర్సీం, అలసందలు, పిల్లిపెసర, వేరుశనగ సాగు చేసుకోవాలి.

- మొక్కజొన్న రాగి,సజ్జలు పచ్చిగా ఉన్నప్పుడు మేతగా ఇవ్వవచ్చు. గొర్రెలు ఇష్టంగా తినే ఈ పచ్చి మేతను చిన్నచిన్న ముక్కలు చేసి ఆహారంగా అందించాలి.
- చింత, రావి, సుబాబుల్, అవిశె, మర్రి, మునగ ఆకులను కూడా మేతగా అందించవచ్చు. పచ్చి మేత విస్తారంగా ఉన్నప్పుడు వాటిని ఎండబెట్టి నిల్వ ఉంచుకోవాలి. వేసవిలో పచ్చి మేత దొరకడం కష్టంగా ఉంటుంది. అలాంటప్పుడు గొర్రెలకు సమీకృత ఆహారం అందించడం ఉత్తమం కంపెనీలు తయారు చేసే మిశ్రమ దాణాను కొనుగోలు చేసి గొర్రెలకు అందించాలి. దీంతో అవి బలహీనపడకుండా ఉంటాయి.



జెస్సీ

పెద్ద గొర్రెలకు దాణా ..

నలుగ కొట్టిన మొక్కజొన్నలు 25 పాళ్లు వేరుశనగ పిండి 32 పాళ్లు గోధుమ, బియ్యం కలిపిన తవుడు 40 పాళ్లు ఖనిజ లవణ మిశ్రమం రెండు పాళ్లు, ఉప్పు ఒక పాలు కలిపి రోజుకు అందించాలి.

విత్తన పొట్టేళ్లకు ..

జత కలిసే సీజన్‌లో ప్రతి విత్తన పొట్టేలుకు రోజుకు 400 నుంచి 500 గ్రామల దాణా మిగతా సీజన్‌లో 200 నుంచి 300 గ్రాముల చొప్పున దాణా అందించాలి.

ఎదిగే గొర్రె పిల్లలకు ..

ఎదిగే గొర్రె పిల్లలకు సగటున 20 గ్రాములు దాణా అందించాలి. మూడు వారాల తర్వాత 50 గ్రాములు ఇవ్వాలి. బయట పచ్చి మేత దొరికితే ఈ దాణా ఇవ్వాల్సిన అవసరం లేదు. గొర్రెలకు దాణా అందించడం ఎంత ముఖ్యమో ఎప్పటికప్పుడు వాటి దాహార్తి తీర్చడం కూడా అంతే ముఖ్యం.

క్రీడల్లో గెలుపోటములు సహజం

- ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్

కుంటాల: క్రీడల్లో గెలుపోటములు సహజమేనని.. క్రీడాకారులు పోరాట స్ఫూర్తి చాటాలని ఎమ్మెల్యే పవార్ రామారావుపటేల్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని పెంచికల్‌పాడ్ గ్రామంలో క్రికెట్ టోర్నీలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేసి మాట్లాడారు. విజేతగా నిలిచిన నర్సాపూర్(జి) మండలం బామిని(బి) జట్టుకు రూ.25వేలు, రన్నరప్‌గా నిలిచిన పెంచికల్‌పాడ్ జట్టుకు రూ.12,500తోపాటు షీల్డులను అందించారు. మాజీ సర్పంచ్ దిగంబర్‌పటేల్, సొలంకి భీంరావు, గణేశ్‌పటేల్, నిర్వాహకులు సంతోష్, ఇంద్రకాంత్, యోగేశ్, శ్యాంరావు తదితరులు పాల్గొన్నారు.



విజేతకు బహుమతి అందిస్తున్న ఎమ్మెల్యే రామారావుపటేల్

కనుల పండువగా ప్రతిష్ఠాపన

నర్సాపూర్(జి): మండలంలోని చాక్‌పల్లి పంచాయతీ పరిధిలోని పాతడొంగుర్గాంలో ఉన్న శ్రీ సిద్ధేశ్వరస్వామి ఆలయంలో బుధవారం దత్తాత్రేయస్వామి, నవగ్రహ, ధ్వజస్తంభ, నంది విగ్రహ ప్రతిష్ఠాపన, కలశ స్థాపన కార్యక్రమాలను వేదపండితులు బబ్లూ మహరాజ్, గణేశ్ మహరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆలయానికి వివిధ విగ్రహ ప్రతిమలను దాతలు అందించారు. దత్తాత్రేయస్వామివిగ్రహాన్ని చాక్‌పల్లి గ్రామస్తుడు గోండ్ర నవీన్ అందించి అన్నదానం ఏర్పాటు చేశారు. నవగ్రహాల విగ్రహాలను బిలోలి గ్రామస్తుడు రవీందర్ రావు, ధ్వజస్తంభం అర్లి(కే) గ్రామస్తుడు చంద్యాల మురళి, నవగ్రహాల మందిరాన్ని డీసీసీబీ డైరెక్టర్ తూర్పాటి వెంకటేశ్, నంది విగ్రహం చాక్‌పల్లి గ్రామస్తుడు గోండ్ర సంతోష్ ఆలయానికి అందించారు. పూజాది కార్యక్రమాలకు బూరుగుపల్లి(కె)కి చెందిన జాదవ్ మోతిలాల్ పటేల్ దాతగా వ్యవహరించారు. ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రమాదం జరిగితే పట్టించుకునే వారెవరూ?



బిల్డింగ్‌పై పడుకున్న విద్యార్థులు



ట్యాంకుపై నుంచి వెళ్తున్న విద్యార్థి

ముధోల్: మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల(బాలురు)లో సిబ్బంది పర్యవేక్షణ కరువైంది. ఈ హాస్టల్‌లో 300 మంది విద్యార్థులు ఉన్నారు. తమకు కేటాయించిన గదుల్లో కాకుండా రోజూ రాత్రి బిల్డింగ్‌లు ఎక్కి ప్రమాదకరంగా నిద్రిస్తున్నారు. నాలుగు భవనాలున్న ఈ పాఠశాలలో మూడు భవనాలపై 150 మంది వరకు విద్యార్థులు ప్రమాదకరంగా నిద్రపోతున్నారు. చుట్టూ పిట్టగోడ కూడా లేదు. ఒక్క భవనానికే మెట్లు ఉన్నాయి. మిగతా రెండు భవనాలకు మెట్లు లేకపోవడంతో వాటర్ ట్యాంక్ మీది నుంచి దూకుతున్నారు.

స్నానాలకు ఇబ్బందులే..

మరోవైపు ఉదయం నీటి సౌకర్యం లేక 100 మీటర్ల దూరంలో ఉన్న పంచాయతీ కార్యాలయం వద్దకు వెళ్లి స్నానాలు చేస్తున్నారు. ఒక రూంలో కరెంట్.. మరో రూంలో ఫ్యాన్ లేకపోవడంతో దాబాపై వెళ్లి పడుకుంటున్నామని విద్యార్థులు తెలిపారు.

రేపటి నుంచి బ్రహ్మోత్సవాలు

లోకేశ్వరం: మండలంలోని బాగాపూర్ గ్రామంలోని శ్రీలక్ష్మీ నారాయణస్వామి ఆలయ వార్షికోత్సవం పురస్కరించుకొని ఈనెల 22 నుంచి 24 వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 22న శాంతి పఠం, దేవతఆజ్ఞ మహాసంకల్పం, గణపతి గౌరి పూజ, స్వస్తి పుణ్యాహవచనం, . ధ్వజారోహణం, గోపూజ, యాగశాల ప్రవేశం, 23న శాంతిపఠం, స్థాపిత దేవతా పూజ, సూక్తిహావనంలు, చండీహోమం, హారతి, నివేదన, 24న శాంతిపఠం, హోమం, జయాదులు, పూర్ణాహుతి, అన్నప్రసాదం, ఉత్సవాల ముగింపు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు బ్రహ్మోత్సవాలకు తరలిరావాలని కోరారు.



ముస్తాబైన లక్ష్మీనారాయణ స్వామి ఆలయం

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

లోకేశ్వరం: మండలంలోని గడ్‌చాంద గ్రామంలో ఉపాధిహామీ నిధులు రూ.ఐదు లక్షలతో చేపట్టే సీసీ రోడ్డు నిర్మాణ పనులను బుధవా రం కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ ప్రారంభించారు. పనుల్లో నాణ్యత లోపించకుండా చర్యలు చేపట్టాలని కాంట్రాక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో సుధాకర్, భోజన్న, నగేశ్ తదితరులు ఉన్నారు.

'సమస్య పరిష్కరిస్తాం'

లక్ష్మణచాంద: ప్రమాదకరంగా మారిన నియంత్రికను సరిచేసి చట్టూ కంచె ఏర్పాటు చేసి సమస్య పరిష్కరిస్తామని విద్యుత్ ఏఈ మహేశ్ పేర్కొన్నారు. మండలంలోని చింతల్‌చాందలో పంచాయతీ కార్యాలయ సమీపంలో ఉన్న విద్యుత్ నియంత్రిక చేతికి అందేలా ప్రమాదకరంగా మారింది. దీనిపై సాక్షిలో ఈనెల 20న బుధవారం ప్రమాదకరంగా విద్యుత్ నియంత్రిక శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. బుధవారం విద్యుత్ ఏఈ మహేశ్, సిబ్బందితో చింతల్‌చాంద వెళ్లి నియంత్రికను పరిశీలించారు.



ట్రాన్స్‌ఫార్మర్ వద్ద పరిశీలిస్తున్న ఏఈ మహేశ్

మద్యం పట్టివేత

నర్సాపూర్(జి): మండలంలోని నందన్ గ్రామంలో కూన గంగాధర్ నుంచి బుధవారం రాత్రి రూ.3930 విలువైన అక్రమ మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై హన్మాండ్లు తెలిపారు. పక్కా సమాచారం మేరకు చేపట్టిన తనిఖీల్లో లైసెన్సు లేకుండా మద్యం సీసాలతో పట్టుబడ్డాడని అన్నారు. 9.6 లీటర్ల మద్యాన్ని పోలీస్‌స్టేషన్ తీసుకెళ్లి కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.



పట్టుకున్న మద్యంతో పోలీసులు

పోరాడి హక్కులు సాధించుకోవాలి

లక్ష్మణచాంద: మహిళలు పోరాడి హక్కులు సాధించుకోవాలని ప్రగతిశీల మహిళా సంఘం(పీవోడబ్ల్యూ) జిల్లా కార్యదర్శి లక్ష్మి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని వడ్యాల్ గ్రామంలో ప్రగతిశీల మహిళా సంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. చీకట్లను చీల్చుకుంటూ వెలుతురు కోసం యుద్ధం ప్రకటించిన రోజును అంతర్జాతీయ మహిళా దినోత్సవంగా జరుపుకొంటారని పేర్కొన్నారు. శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా, కనీస సౌకర్యాల కోసం , మీటింగ్ నిర్వహించే హక్కు కోసం, పురుషులతోపాటు యూనియన్లలో తమకు కూడా భాగస్వామ్యం కల్పించాలని కోరారు. పీవోడబ్ల్యూ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.లక్ష్మి, ముత్తవ్వ, గంగామణి, ఎస్.లక్ష్మి, రేష్మ తదితరులు పాల్గొన్నారు.



వడ్యాల్‌లో మాట్లాడుతున్న లక్ష్మి

బీఎల్‌వోలు అందుబాటులో ఉండాలి

లోకేశ్వరం: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బీఎల్‌వోలు అందుబాటులో ఉండాలని తహసీల్దార్ మోతీరాం అన్నారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌వోలకు 12–డీ ఫారంపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో దివ్యాంగులు, వృద్ధులతో ఇంటి వద్ద ఓటు వేసే విధానం వివరించారు. వారి వివరాలను ఫారంలో నింపి ఎన్నికల అధికారులకు అందించాలన్నారు. ఎండల తీవ్రత పెరుగుతున్నందున గ్రామాల్లో ఉదయం 10:30 గంటల్లోగా విధులు ముగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ బాలకిషన్, ఏఎస్‌వో సౌమ్య, రెవెన్యూ సిబ్బంది నరేశ్ ఉన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ మోతీరాం

చిన్నారులకు పౌష్టికాహారం అందించాలి

ముధోల్: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు పౌష్టికాహారం సక్రమంగా అందించాలని ఐసీడీఎస్ సీడీపీవో శ్రీమతి అన్నారు. మండల కేంద్రంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో బుధవారం బాసర, ముధోల్, తానూరు మండలాల్లోని 180 అంగన్‌వాడీ కేంద్రాలకు బరువు, ఎత్తు మిషన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. టీచర్లు అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల ఎత్తు, బరువు వివరాలు రోజు నమోదు చేసుకోవాలన్నారు. సిబ్బంది సమయపాలన పాటిస్తూ సక్రమంగా విధులు నిర్వర్తించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ఉన్నారు.



మాట్లాడుతున్న సీడీపీవో శ్రీమతి

దాతల సాయంతో అంగన్‌వాడీ ఆధునీకరణ

ఖానాపూర్: పట్టణంలో 12వ వార్డు పరిధిలో ఉన్న సుభాశ్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రానికి దాతల సాయంతో మరమ్మతులు చేయించారు. సుభాశ్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో పని చేసే టీచర్ సరోజ కూతురు మానికరెడ్డి, అబ్బాయి సాయిప్రణీత్‌రెడ్డి సమకూర్చిన రూ.50 వేలతో కేంద్రాన్ని ఆధునీకరించారు. ఈసందర్భంగా బుధవారం అంగన్‌వాడీ కేంద్రాన్ని సీడీపీవో సరిత ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన పోషణ్ పక్వాడా కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నిర్మల, రాధ, శ్యామల, శహీనాజ్ తదితరులు పాల్గొన్నారు.



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సీడీపీవో సరిత

గౌడ సంఘం మండల కార్యవర్గం

లక్ష్మణచాంద: మండలంలోని వడ్యాల్ గ్రామంలో ఉన్న శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయంలో బుధవారం గౌడ సంఘం మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం గౌరవ అధ్యక్షులుగా మేడి నారాగౌడ్, అంజాగౌడ్, గంగాధర్‌గౌడ్, రాజేశ్వర్‌గౌడ్, మండలాధ్యక్షుడిగా కె.వేణుగోపాల్ గౌడ్, ఉ పాధ్యక్షుడిగా దమ్మగోని బాబుగౌడ్, కోశాధికారిగా కె.రాజా గౌడ్, ప్రధాన కార్యదర్శిగా విఠల్‌గౌడ్, సంయుక్త కార్యదర్శిగా రవీందర్‌గౌడ్, సలహాదారులుగా డి.రమణగౌడ్, నాగుల లింబాగౌడ్, సంతోష్‌గౌడ్, నర్సాగౌడ్, దశగౌడ్, గంగాధర్ గౌడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని పేర్కొన్నారు.



ఎన్నికైన కార్యవర్గం

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

మామడ: మండలంలోని పొన్కల్ గ్రామానికి చెందిన డీసీసీబీ మాజీ డైరెక్టర్ కాలగిరి గంగారెడ్డి, పలువురు బీఆర్ఎస్ నాయకులు బుధవారం డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో పొన్కల్, అనంతపేట్, పోతారం గ్రామాలకు చెందిన పలువురు బీఆర్ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తామని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి, రఫీ, బాపయ్య, వికాస్‌రెడ్డి, శ్రీనివాస్, లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లోకేశ్వరం: మండలంలోని గడ్‌చాంద ఎత్తిపోతల పథకం చైర్మన్ గంగారావు బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు. బుధవారం భైంసాలోని కాంగ్రెస్ కార్యాలయంలో ముధోల్ మాజీ ఎమ్మెల్యే నారాయణ్‌రావు పటేల్ ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గడ్డం సుదర్శన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సుధీర్‌రెడ్డి, రాంచందర్ రెడ్డి, ఓం ప్రకాశ్ లడ్డా, భోజారాం పాల్గొన్నారు.



కాంగ్రెస్‌లో చేరిన వారితో శ్రీహరిరావు

పక్షులను రక్షిద్దాం

లక్ష్మణచాంద: పక్షులను రక్షించి పర్యావరణం కాపాడుదామని పీచర ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విద్యారాణి పేర్కొన్నారు. బుధవారం అంతర్జాతీయ పిచ్చుకల దినోత్సవం పురస్కరించుకొని పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు బోర్డుపై పిచ్చుకల చిత్రాలు గీయగా ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. బాధ్యతగా ఇంటి పరిసరాల్లో పక్షులకు నీటి తొట్టెలను ఏర్పాటు చేయాలని హెచ్ఎం కోరారు. హంసలత, మోహన్‌రెడ్డి, తదితరులు న్నారు.

కుంటాల: జీవవైవిధ్యానికి ప్రతీకగా ఉండే పిచ్చుకలను కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని హెచ్ఎం ఎల్లన్న పేర్కొన్నారు. బుధవారం ప్రపంచ పిచ్చుకల దినోత్సవం సందర్భంగా పాఠశాలలో విద్యార్థులతో నీటితొట్టెలను ఏర్పాటు చేయించారు. ఉపాధ్యాయులు ఉమారాణి, శ్రీనివాస్ పాల్గొన్నారు.